నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 1 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలను జయప్రదం చేయండి

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సారపాక, జనవరి 31: బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈ నెల 2న ఇల్లెందు, 3న భద్రాచలం, పినపాక, కొత్తగూడెంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలకు పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇల్లెందు సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, భద్రాచలం, పినపాక సమావేశాలకు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, కొత్తగూడెం సమావేశానికి మాజీ మంత్రి కడియం శ్రీహరి హాజరై పార్టీ నాయకులకు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ బలోపేతం కోసం సమావేశాలకు పార్టీ నాయకులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- అరగంట ముందుగా ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం
- ఖమ్మంలో 86 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు
- మూడు దశల్లో పరీక్ష నిర్వహణ షెడ్యూల్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 31 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు స్పెల్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో స్పెల్‌లో ఐదు రోజుల చొప్పున ఖమ్మం జిల్లాలోని 86 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా.. పారదర్శకంగా నిర్వహించేందుకు అరగంట ముందు మాత్రమే ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నాపత్రాన్ని కళాశాలలకు చేర్చనున్నారు. ఈసారి ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో సైతం ప్రాక్టికల్ పరీక్షను 16వ తేదీన నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం

గతంలో ప్రశ్నాపత్రాలు కళాశాలలకు వారం రోజుల ముందుగా చేరుకోవడంతో అక్రమాలు జరిగేందుకు ఆస్కారం ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత కేసీఆర్ ప్రభుత్వం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు నూతన పద్ధతులను ప్రవేశ పెట్టింది. దీంతో వన్‌టైమ్(ఓటీపీ) పాస్‌వర్డ్ విధానంలో పరీక్ష కేంద్ర ఎగ్జామినర్ సెల్‌ఫోన్‌కి అరగంట ముందు మాత్రమే ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రాన్ని పంపుతారు. ఎగ్జామినర్ సెల్‌ఫోన్‌కి మెసేజ్ రాగానే అతను సంబంధిత వెబ్‌సైట్ నుంచి ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్విజిలేటర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ప్రశ్నలు ముందుగా తెలిసే అవకాశం ఉండదు. అలాగే హాల్‌టికెట్ ఆధారంగా ఏ విద్యార్థికి ఏ సెట్ ప్రశ్నాపత్రం ఇవ్వాలనే అంశాన్ని పేపర్ కోడ్ ఆధారంగా వెబ్‌సైట్‌లో పేర్కొంటారు. కళాశాలలవారీగా ప్రశ్నాపత్రాల కోడ్‌లు వేర్వేరుగా ఉండడంతోపాటు పరీక్ష సమయానికి అరగంట ముందుగా ఇన్విజిలేటర్ హాల్‌టికెట్ ఆధారంగా ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ ఇచ్చేలా మార్పులు చేశారు.

రెండు సెషన్లలో నిర్వహణ

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ముగిసిన తర్వాత గంటలోపే అధ్యాపకులు సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. వాల్యుయేషన్ చేసిన మార్కుల జాబితాను ఎగ్జామినర్ ఇంటర్ బోర్డుకు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో 86 కేంద్రాలు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే సీసీ కెమెరాలను అమర్చారు. ప్రభుత్వ కళాశాలలతోపాటు ప్రైవేట్ కేంద్రాల్లోనూ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 86 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 76 కేంద్రాలు జనరల్ విద్యార్థులకు, 10 కేంద్రాలు ఒకేషనల్ విద్యార్థుల కొరకు ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లాలో 13,194 మంది జనరల్ కోర్సు విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరవుతుండగా.. 4,650 మంది వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన వారు పరీక్షలు రాయనున్నారు. మూడు దశల్లో నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ కేటాయించారు. ఇందులో భాగంగా స్పెల్‌ను 5 రోజులపాటు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణను డీఐఈవో రవిబాబు పర్యవేక్షించనున్నారు. ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ, హైపవర్ కమిటీ పరీక్షలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టనున్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, జనవరి 31 : అంతర్గత రోడ్ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. తూరుబాక పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో రూ.5 లక్షలు, బి.కొత్తగూడెం పంచాయతీ పరిధి బండారిగూడెంలో సీడీపీ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, సర్పంచ్‌లు భూక్యా చందు, కాటిబోయిన వెంకటేశ్వర్లు, సోడె కొండయ్య, సొసైటీ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందాలి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, జనవరి 31 : గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వారికి సక్రమంగా అందించేందుకు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌తో కలిసి సీఎం గిరివికాసం, ప్రధానమంత్రి ఆది ఆవాస్ గ్రామయోజన, ట్రైకార్ పథకాలు, ఆర్‌వోఎఫ్ఆర్(డీఎల్‌సీ) పరిధిలోని వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్.. పీఎంఏఏజీవై పథకానికి మొదటి దశ రూ.2 కోట్లతో మంజూరు చేసిన ఇంజినీరింగ్ మరమ్మత్తు పనుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెండో దశకు సంబంధించి రూ.2.40 కోట్లతో చేపట్టనున్న ప్రతిపాదిత పనులపై ఆయా శాఖలవారీగా సమీక్షించారు. ట్రైకార్ పథకం కింద 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యూనిట్ల స్థిరీకరణలో పెండింగ్ యూనిట్లపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్‌కు సంబంధించి కొణిజర్ల, సింగరేణి, రఘునాథపాలెం మండలాల్లో పోడు పట్టాలు పొందిన తమకు సాగునీటి కోసం బోర్ వెల్స్‌ను అనుమతించాలని, మట్టి రోడ్లను నిర్మించాలని గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన కమిటీ ఆమోదం తెలిపింది. వన్యమృగాలను వేటాడటం నిషేధమని, వాటి కోసం అడవుల్లో ఉచ్చులు అమర్చినట్లైతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏపీవో డేవిడ్ రాజ్, అటవీ, నీటిపారుదల, విద్యుత్, వైద్య, వ్యవసాయ, పీఆర్, రోడ్లు, భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

3న ఖమ్మంలో మెగా జాబ్ మేళా

65 పైగా కంపెనీలు.. 5వేల ఉద్యోగాలు

జిల్లా యువజన, క్రీడల అధికారి సునీల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న తుంబూరు సునీల్‌రెడ్డి

రఘునాథపాలెం, జనవరి 31 : రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ స్టేట్ స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీ శనివారం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సర్దార్ పటేల్ స్టేడియంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వేల ఉద్యోగాలు కల్పించేందుకు 65కి పైగా ప్రముఖ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మా, ఐటీ జాబ్స్, మార్కెటింగ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, కాల్ సెంటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అడ్మినిస్ట్రేషన్, రియల్‌ఎస్టేట్, రిటైల్ హౌజ్ కీపింగ్, స్టోర్ మేనేజర్, డెలివరీ బాయ్స్, ఫిట్టర్, చెఫ్ అండ్ డ్రైవర్స్ వంటి ఉద్యోగాలు పొందేందుకు జీరో విద్యార్హత నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువత అర్హులుగా పాల్గొన్నారు. ఆసక్తి గల వారు కార్యాలయం లేదా 8886711991, 9642333668 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సమాచార పౌరసంబంధాల అసిస్టెంట్ అధికారి వల్లోజి శ్రీనివాసరావు, టీఎస్ స్టెప్ హైదరాబాద్ ప్రతినిధి మన్మోహన్ పాల్గొన్నారు.

కారియ్యలే.. గన్‌మెన్ రాలే..!

- భద్రాద్రి జడ్పీ చైర్మన్‌కు వాహన కేటాయింపులో నిర్లక్ష్యం
- నెలన్నర దాటినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- అధికారిక పర్యటనకూ సొంత వాహనంలోనే..

జడ్పీ చైర్మన్‌గా నియామకపత్రం అందుకుంటున్న కంచర్ల చంద్రశేఖరరావు(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : జిల్లా ప్రొటోకాల్ పదవి ఉన్నా.. భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి నెలన్నర దాటినా ప్రభుత్వ వాహనం కేటాయించడంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో జడ్పీ చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య ఇల్లెందు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. డిసెంబర్ 9న వైస్ చైర్మన్‌గా ఉన్న కంచర్ల చంద్రశేఖరరావుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించి ప్రమాణ స్వీకారం చేయించారు. జడ్పీ సీఈవో విద్యాలత, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయినా ప్రభుత్వ వాహనాన్ని ఇప్పటివరకు అప్పగించలేదు. పాత వాహనం ఖాళీగా ఉన్నా దానిని జడ్పీ కార్యాలయంలో పక్కన పెట్టారే తప్ప చైర్మన్‌కు అప్పగించడంలో వెనుకడుగు వేస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

జడ్పీ చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య రాజీనామా తర్వాత కొత్త చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కంచర్ల చంద్రశేఖరరావుకు గన్‌మెన్ కాదు కదా.. సర్కారు వాహనం కూడా దక్కనివ్వకుండా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త సర్కారు రావడం.. ప్రస్తుతం ఉన్న చైర్మన్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావడం వల్ల ప్రభుత్వ వాహనం ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాక గతంలో ఉన్న క్యాంపు ఆఫీస్ సైతం అప్పగించకపోవడం కొసమెరుపు. దీంతో జడ్పీ చైర్మన్ సొంత వాహనంలోనే కార్యాలయానికి వెళ్తున్నారు. జిల్లాలో అధికారుల పర్యటనకు కూడా సొంత వాహనంపైనే వెళ్లాల్సి వస్తోంది. దీనిపై జడ్పీ సీఈవో విద్యాలతను వివరణ కోరగా.. చైర్మన్‌కు వాహన కేటాయింపు విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదన్నారు. పై నుంచి ఆదేశాలు వస్తే తప్పక కేటాయిస్తామన్నారు. గన్‌మెన్ కేటాయింపు విషయం నాకు తెలియదని ఆమె వివరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు సీపీ సునీల్ దత్ హెచ్చరికలు

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీపీ సునీల్ దత్

ఖమ్మం, జనవరి 31: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సహించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన రౌడీషీటర్లకు ఇచ్చిన కౌన్సిలింగ్‌లో మాట్లాడారు. ఎవరెవరు ఎక్కడ నివస్తున్నారు.. ఏం పని చేస్తున్నారు.. అని ఒక్కొక్కరినీ విచారించారు. నేరప్రవృత్తిని మార్చుకునేందుకు పోలీస్‌శాఖ అవకాశం ఇస్తున్నదని, అయినా మారకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదన్నారు. సమాజంతో మంచి నడవడికతో మెలగాలన్నారు. మళ్లీ నేరాలకు పాల్పడితే ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ బనాయించేందుకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. సివిల్ వివాదాల్లో ఏమాత్రం జోక్యం చేసుకోవద్దన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై పోలీస్‌శాఖ నిఘా ఉంటుందన్నారు. సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రౌడీషీటర్లెవరైనా బెదిరిస్తే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

లారీ, రూ.2లక్షల నగదు స్వాధీనం

మాట్లాడుతున్న ఖమ్మం ఏసీపీ హరికృష్ణ

మామిళ్లగూడెం, జనవరి 31 : నగరంలోని రెండు లారీలు ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం ఏసీపీ హరికృష్ణ తెలిపారు. బుధవారం ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన తమ్మిశెట్టి చిరంజీవి, ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట కాలనీకి చెందిన కొత్త ఎలీషా ఖమ్మం త్రీటౌన్ ఏరియాలోని రోడ్డు పక్కన పార్క్ చేసి ఉంచిన లారీలు, గత ఏడాది నవంబర్‌లో ఒక లారీ, ఈ ఏడాది జనవరిలో మరో లారీని దొంగిలించారని తెలిపారు. వీరిపై నిఘా పెట్టిన ఖమ్మం సీసీఎస్ త్రీటౌన్ పోలీసులు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. నవంబర్‌లో చోరీ చేసిన లారీని విడివిడి భాగాలుగా చేసి అమ్మి వేయడంతో దానిద్వారా వచ్చిన రూ.2 లక్షలను సైతం స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీసీఎస్ ఏసీపీ టి.రవి, సీసీఎస్ సీఐ బి.బాలాజీ, ఖమ్మం త్రీటౌన్ సీఐ బి.రమేశ్, సీసీఎస్ ఎస్ఐ జె. వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ శ్రీనివాస్ సుధాకర్ పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల

కూసుమంచి, జనవరి 31 : మూడు జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ జలాశయం నుంచి బుధవారం సాయంత్రం పాలేరు జలాశయానికి 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం పాలేరు నీటిమట్టం 11.30 అడుగులకు పడిపోగా.. పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు. అయితే జనవరిలోనే నీటి సమస్య ఉత్పన్నమైతే వేసవిలో తీవ్ర తాగునీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని గుర్తించిన అధికారులు ఇందుకు ప్రత్యామ్నాయంగా సాగర్ నుంచి ప్రస్తుతానికి 6వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పాలేరు జలాశయానికి నీటిమట్టం 22 అడుగులు వచ్చే వరకు సుమారు వారంరోజుల పాటు నీటిని వదిలే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సాగర్ డ్యాం కూడా నీటి విషయంలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటుండడంతో ప్రతీ నీటి బొట్టును జాగ్రత్తగా వాడుకోవాలని, అందుకు ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. సాగర్ నుంచి పాలేరు వరకు ఉన్న మేజర్లు, మైనర్లు, తూములు, షట్టర్ల వంటి వాటితోపాటు ఎక్కడా కాలువలో నీరు ప్రవహించే సమయంలో ట్యాంపరింగ్ కాకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. గురువారం అర్ధరాత్రి వరకు పాలేరుకు సాగర్ జలాలు చేరుకునే అవకాశం ఉంది.